Andhra Jyothi                    dt. 25/01/14



టాంజానియా ప్రతినిధులతో ఎన్వీఎస్ రెడ్డి

## మెట్రో రైల్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన

# టాంజానియా బృందం

ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ : ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో దేశంలో చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్టులలో ఒకటైన 'మెట్రోరైలు'ను పరిశీలించేందుకు టాంజానియా ఉన్నతస్థాయి బృందం శుక్రవారం నగరానికి వచ్చింది. ఈ బృందానికి టాంజానియా ప్రధాని శాశ్వత కార్యదర్శి జుమాన్ ఏ సగిని నేతృత్వం వహించారు. హైదరాబాద్ మెట్రోరైలు గురించి తాము చాలా విన్నామని, అందుకే దీన్ని ప్రత్యక్షంగా చూసేందుకు వచ్చామని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి చెప్పారు. బిడ్ విధానం, న్యాయపరమైన పత్రాలు, సాంకేతిక, ఆర్థిక అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్వీఎస్ రెడ్డి వారికి వివరించారు. ప్రాజెక్టు అమలులో ఎదురవుతున్న సమస్యలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా అధిగమిస్తున్నారో తెలిపారు. ఇది ప్రజారవాణా వ్యవస్థగా మాత్రమే కాకుండా బహుళ ప్రయోజనాలతో పట్టణ పునర్నిర్మాణ ప్రాజెక్టుగా రూపొందుతోందన్నారు. ఇతర రవాణా వ్యవస్థలతో మెట్రో రైలు అనుసంధానం, ఫీడర్ బస్సు సర్వీసులు, పాదచారుల సదుపాయాలు, సైకిల్‌స్టేషన్లు, వీధుల్లో ప్రత్యేక ఏర్పాట్లు, మహిళలు, వృద్ధులు, పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ.. తదితర విషయాలను ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. నిర్మాణ సమయంలో రోడ్డు మీద వెళ్లేవారికి ఇబ్బంది లేకుండా ప్రవేశ పెట్టిన ప్రీకాస్టింగ్ పద్ధతి, పూర్తిస్థాయి ఇంజనీరింగ్ నైపుణ్యాల వినియోగంపై టాంజానియా బృందం అభినందనలు తెలిపింది. తమ దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టే సమయంలో సలహాలు, సూచనలు తీసుకుంటామని ఎన్వీఎస్ రెడ్డికి తెలిపింది.